


తలుపు దబదబబాదుతున్న చప్పుడుకు ఏదో ఆలోచనలో నిమగ్నమైవున్న లలిత ఉలిక్కిపడి లేచింది. తలుపు తెరిచి విశ్చేష్టమైపోయిన భార్యను చూసి "ఏంటి లలితా" అంటూ వచ్చిన మధుమూర్తి. పూలదండలలోవున్న కొడుకుని. నవ వధువుని. చూసి నోట మాటరాకుండా అయిపోయాడు.

ఆగ్రహంతో కళ్ళు ఎర్రబడిన లలిత "ఛీ వెధవా! ఏ మొహం పెట్టుకొని వచ్చావురా? పెద్దలం మేం ఇంకా బ్రతికివుండగానే ఒక్క మాటయినా చెప్పకుండా తగుదునమ్మా అంటూ పెళ్ళి చేసుకొచ్చావా? నీకన్నా ఎదిగిన ఇద్దరాడపిల్లలుండగా పెళ్ళికెందుకంత తొందర వచ్చిందిరా?

ఏమ్మా - మావాడి కెలాగూ బుద్ధిలేదూ. ఆడపిల్లవి నీకుండక్ఖర్లేదా? ఏనాడూ నామాట కెదురు చెప్పలేనివాణ్ని నీకొంగుకు ముడేసుకొంటావా? రేపు- నీకూ ఓ కొడుకు పుట్టి- వాడూ ఇలాంటి వెధవపని చేసిననాడుగానీ."

లలిత ఇంకా ఏదో అనబోతూ వుండగానే మధుమూర్తి లలితా - వాళ్ళిద్దర్నీ తక్షణం ఇంట్లోంచి పొమ్మను. అంతేగానీ ఇక ఏమీ అనకు- ఆ తలుపులు మూసెయ్ ముందు" అంటూ లోపలికి వెళ్ళిపోయాడు మధుమూర్తి. నిద్రకు నోచుకోని అతని కళ్ళ ముందు గతం గిర్రున తిరిగింది.

* * *

"లోకం మారిపోతోంది. మా కాలంలో మేమెప్పుడూ ఇలాగ పెద్దవాళ్ళ నెదిరించి మాట్లాడలేదు. పెళ్ళికెదిగిన అక్కవుండగా నువ్విలా ఆ అమ్మాయినిప్పుడు పెళ్ళి చేసుకుంటాననడం ఏమీ సమంజసంగా లేదు. నిదానంగా ఆలోచించు" అన్నారు రామారావుగారు. కొడుకు ఎదిరించి మాట్లాడటం ఆయన్ని చాలా కలవరపెట్టింది.

"ఏం అక్కపెళ్ళి ఈ ఏడు చేసేస్తున్నారా? మరో ఐదేళ్ళకో పదేళ్ళకోగాని అక్కకి పెళ్ళిచేసే తాహతు రాదు మీకు అందుకని అంతవరకు లలితను పెళ్ళి చేసుకోకుండా మడిగట్టుకూర్చోవాలా?" తల ఎగరేస్తూ విసుగ్గాఅన్నాడు మధు.

"చూశారా! వాడెంతంత మాటలంటున్నాడో... అయినా ఆస్తంతా వీళ్ళకేపెట్టాం గదా-పెళ్లి కావలసిన పిల్ల బజార్నపడి దాని పొట్టఅదిపోసుకోవడమేగాక వీణ్ని చదివించినా-వీడికి మాత్రం అక్క అన్నీ చేసిందే నన్న విశ్వాసం లేదు."

"అరేయ్! మధూ! నువ్వేది కావాలంటే అది ఒక్కగానొక్క మగపిల్లాడంటూ అమర్చాం గదరా! ఈ పెద్ద వయసులో మమ్మల్నిపోషిస్తూ ఇంటిబాధ్యత తీసుకోవలసిందిపోయి ఇలా నాన్నగార్ని ఎదిరిస్తావేంట్రా?" గొంతు జీరపోతూండగా అన్నారు సావిత్రమ్మగారు.

"ఏంటి మీరమర్చింది-నాకు ఊహ తెలిసిందగ్గర్నుంచి ఇదే పేదరికం-ఇదే వెధవ బ్రతుకు-ఉన్న ఆస్తినంతా మీ వయసులో మీ సుఖాలకు-విలాసాలకు ఖర్చు పెట్టుకొన్నారు-పిల్లల్ని కనగానే కాదు-వారి మంచి చెడ్డలు చూడవలసిన బాధ్యత మీది. పెద్ద వాళ్ళిద్దరికీ ఉన్న ఇల్లు అమ్మి పెళ్ళి చేశారు. ఇప్పుడు అక్కకి. ఇద్దరి చెల్లెళ్ళకి ఎలా చేద్దామనుకుంటున్నారు? ఇప్పుడు ఆయనేదో దయతలచి పిల్లనిచ్చి పెళ్ళి చేసి ఉద్యోగమిస్తానని అనగానే నా తలకు మించిన భారం మీరువేస్తే ఎలా భరించాలి?

మీకు ఎల్లకాలం కష్టాలు తప్పవు. అందుకని నేనూ ఇలాగే కష్టాల్లో మ్రగ్గిపోవాలనా మీ వుద్దేశ్యం.

నా బ్రతుకు నా చేతుల్లో వుంది- మీరు చెప్పినట్లే చేయాలంటే ముసలాణ్ణయిపోయినా. నాకీ బాధ్యతలు వదలవు. అందుకే అమ్మా-నాన్నా గుడ్‌బై-చరాచరా బయటకు నడిచాడు మధుమూర్తి.

* * *

అప్పుడు తను పెళ్ళి చేసుకుంటానని మాత్రమే తండ్రిని అడిగాడు. ఇప్పుడు తన కొడుకు ఏకంగా పెళ్ళి చేసుకొనే వచ్చాడు. "తరం-తరం నిరంతరం" ఈ ఘర్షణ జరుగుతూనే వుంటుందన్న మాట అనుకొన్నాడు బాధగా కళ్ళు తుడ్డుకొంటూ మధుమూర్తి.




